స్క్రీనింగ్‌తో రొమ్ము క్యాన్సర్‌కు చెక్

- మహిళల్లో అవగాహన అవసరం
- ప్రతి ఎనిమిది మందిలో ఒకరు బాధితులే
- రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా అక్టోబర్

'గుంటూరు అరండల్‌పేటకు చెందిన శ్రీదేవి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హైదరాబాద్‌లో ఉంటూ ఇటీవల అనారోగ్యంతో సొంతూరు వచ్చింది. రొమ్ములో నొప్పిగా ఉన్నా కాలయాపన చేసింది. నొప్పి తీవ్రం కావడంతో వైద్యులను సంప్రదించింది. వైద్యులు రొమ్ములో గడ్డలు ఉన్నాయని, చికిత్స చేయించుకోకపోవడంతో క్యాన్సర్‌గా మారినట్లు నిర్ధారించారు.' అనంతరం చికిత్స అందించారు. ఎక్కువ మంది సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోకపోవటం వలనే రొమ్ము క్యాన్సర్ కేసులు పెరిగిపోతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు మెడికల్: రొమ్ము క్యాన్సర్ వయసు తక్కువ వాళ్లకు కనిపిస్తున్నాయి. సాధారణంగా 50 ఏళ్లు దాటిన తరువాత వచ్చే అవకాశం ఉంది. వ్యాధిపై అవగాహన లేకుండా నిర్లక్ష్యంగా ఉండటం వలనే ప్రతి ఏడాది రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ప్రతి ఏడాది అక్టోబరు నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.

లక్షణాలు....

రొమ్ములో గడ్డలు, చంకలో గడ్డలు ఉంటే రొమ్ము క్యాన్సర్‌గా అనుమానించాలి. రొమ్ములపై చర్మం ముడతలు పడటం, గట్టిగా మారడం, గుంటలు పడటం, నారింజ రంగులోకి మారితే అనుమానించాలి. చనుమొనలు నొక్కితే సరిగా లోపలికి వెళ్లకపోయినా, రెండు రొమ్ములు కూడా సైజుల్లో తేడాలు ఉండే వైద్యులను సంప్రదించాలి. చనుమొనల నుంచి తెలుపు, పసుపు, ఎరుపు రంగుల్లో ఏదైనా ద్రవం బయటకు వస్తే రొమ్ము ఛాతిపై ఉన్న చర్మం లోపలికి వెళ్లి చర్మం చొట్టలు పడుతుంది. బ్రెస్ట్ నిపుల్స్(చనుమొనలు) చుట్టూ ఉండే చర్మం పొలుసులుగా మారి రాలి పోతుంది.



రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవం పోస్టర్

కారణాలు....

జన్యుపరమైన కారణాలు, వాతావరణంలో వస్తున్న మార్పుల వలన రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. అధిక బరువు, ఆల్కహాల్, పొగాకు వినియోగం, 30 ఏళ్ల వరకు గర్భం దాల్చని వారిలో, అసలు గర్భం దాల్చని వారిలో రావొచ్చు. చిన్న వయస్సులోనే రజస్వల అవ్వటం, ఆలస్యంగా నెలసరి ఆగిన వారికి వచ్చే అవకాశం ఉంది. ఆధునిక జీవన శైలి వలన, శారీరక వ్యాయామం లేకపోవడం, హార్మోన్స్‌లో మార్పులు, కుటుంబంలో ఎవరికైనా క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశం ఉంది. సంతానం అప్పుడే వద్దు అనుకొని దంపతులు మందులు వాడం ద్వారా వచ్చే అవకాశం ఉంది. రొమ్ములో ఉండే ప్రతి గడ్డ క్యాన్సర్ గడ్డ కాదు. అయితే ప్రతి గడ్డను కూడా అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించి పరీక్ష చేయించుకోవటం ద్వారా నిర్ధారించుకోవచ్చు.

ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు...

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే వైద్య పరికరం మామోగ్రఫీ వైద్య పరికరం అందుబాటులో ఉంది. కార్పొరేట్ క్యాన్సర్ వైద్యసేవలను పేదలకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నాట్కో ట్రస్ట్ వారు రూ. కోటి విలువైన త్రీడీ డిజిటల్ మామోగ్రఫీ వైద్య పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు. బాధితులకు అవసరమైన ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు.

మామోగ్రామ్ పరీక్షలు చేయించుకున్నవారి వివరాలు ...

జీజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష మామోగ్రామ్ 2017లో 321 మంది చేయించుకున్నారు. 2018లో 123 మంది, 2019లో 217 మంది, 2020లో 13 మంది, 2021లో 35 మంది, 2022లో 100 మంది, 2023లో 558 మంది, 2024 సెప్టెంబరు వరకు 184 మంది పరీక్షలు చేయించుకున్నారు.

ఉచితంగా రొమ్ము క్యాన్సర్ ఆపరేషన్లు...



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే ధీటుగా రొమ్ము క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేలా ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశాం. చాలా ఆపరేషన్లు చేశారు. ప్రాథమిక దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించి ప్రాణాంతకం కాకుండానే వ్యాధి నుంచి విముక్తి కల్పించాం. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు త్వరలోనే వంద పడకలతో మరో క్యాన్సర్ సెంటర్ నిర్మాణం జీజీహెచ్‌లో చేపడుతున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్

మెమోగ్రామ్‌తో తొలిదశలోనే గుర్తించవచ్చు



తొలి దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు మామోగ్రామ్ పరీక్ష చేస్తారు. మామోగ్రామ్‌తో రెండు మిల్లీ మీటర్ల కన్నా తక్కువ సైజులో రొమ్ములో గడ్డలు ఉన్నా గుర్తించి వెంటనే వైద్యం చేయవచ్చు. తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే వ్యాధి నుంచి త్వరితగతిన కోలుకోవటంతోపాటుగా మరణాన్ని తప్పించవచ్చు. మహిళలే స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకుని రొమ్ములో ఏమైనా గడ్డలు ఉన్నట్లు అనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ చక్కా సుజాత, సీనియర్ రేడియాలజిస్ట్, గుంటూరు.

స్క్రీనింగ్ పరీక్షలతో చెక్‌పెట్టవచ్చు



ఆధునిక జీవన శైలి వలన ప్రస్తుతం 30 ఏళ్లలోనే రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. తప్పనిసరిగా మహిళలంతా మామోగ్రామ్, బయాప్సి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. ఈ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ప్రథమ దశలోనే గుర్తించి చికిత్సతో పూర్తిగా నివారించవచ్చు. సంతానం లేనివారికి, ఆలస్యంగా పిల్లలు పుట్టిన వారికి వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి. రేడియేషన్ థెరపీ, కిమో థెరపీ, ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

క్లుప్తంగా

స్టడీ టూర్‌కి వెళ్లిన నగర కమిషనర్



నెహ్రూనగర్: ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లలో ఆస్తి పన్ను, నీటి సరఫరా, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అమలు తీరు, ఘన వ్యర్థాల నిర్వహణపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్టడీ టూర్‌లో భాగంగా మంగళవారం భువనేశ్వర్ మునిసిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల పని తీరుని పరిశీలించారు. తొలుత భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాజేష్ ప్రభాకర్ పాటిల్ స్వాగతం పలికి వివరాలు తెలిపారు. అనంతరం గుంటూరు కమిషనర్ బృందానికి విభాగాల వారీగా వివరించడానికి ప్రత్యేకంగా అధికారులను కేటాయించగా, కార్పొరేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్, వాటర్ ఫిల్టరేషన్ పాయింట్స్, డిస్ట్రిబ్యూషన్ విధానం, తాగునీటి సరఫరా, చార్జీలు, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లను పరిశీలించారు.

జీజీహెచ్‌లో భవనాల తొలగింపులో వ్యక్తికి గాయాలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో లాండ్రి విభాగం భవనం తొలగించి, వంద పడకలతో క్యాన్సర్ సెంటర్ నిర్మించేందుకు నాట్కో ట్రస్టు ముందుకు వచ్చింది. ఈమేరకు మూడు రోజులుగా భవనం తొలగింపు పనులు సాగుతున్నాయి. మంగళవారం భవన నిర్మాణం తొలగిస్తున్న సమయంలో ఇనుప విద్యుత్ స్తంభం కార్మికుడిపై పడడంతో చేతికి, భుజానికి గాయాలు అయ్యాయి. వెంటనే ఆస్పత్రి అధికారులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. బలమైన గాయం కావడంతో శస్త్రచికిత్స చేశారు. కాగా గతంలో రూ. 45 కోట్లతో నాట్కో ట్రస్టు జీజీహెచ్‌లో అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో నాట్కో క్యాన్సర్ భవన నిర్మాణం చేపట్టింది. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండటం, పడకలు సరిపడకపోవడంతో మరో వంద పడకలతో భవన నిర్మాణం చేపట్టేందుకు నాట్కో ట్రస్టు ముందుకు వచ్చి నిర్మాణ పనులు ప్రారంభించింది. గుంటూరుకు చెందిన ప్రైవేటు కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. గాయపడిన వ్యక్తి పిడుగురాళ్లకు చెందిన రాజుగా ఆస్పత్రి అధికారులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు సహాయ కేంద్రం ప్రారంభం

లక్ష్మీపురం: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఓటర్ల నమోదుకు సహకరించేందుకు అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని సీనియర్ వైద్యులు డాక్టర్ ఎస్.ఫణీంద్ర కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేట అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం గైడెన్స్ సెల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలనే ఉద్దేశంతో అవగాహన సంస్థ నిర్వహిస్తున్న ఈ గైడెన్స్ సెల్ సేవలు అందరూ ఉపయోగించుకోవాలన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ వరకు ఈ పట్టభద్రుల ఓటర్ల నమోదుకు సంబంధించిన గైడెన్స్ సెల్ పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.సింగరయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల వీఎస్ ప్రసాదరావు, సంస్థ సీనియర్ సభ్యులు పి.భావన్నారాయణ, సిహెచ్.ప్రసాద్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య, ఇంజినీర్ సదాశివం ప్రసంగించారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన ఉండాలి

జెడ్పీ డెప్యూటీ సీఈఓ కృష్ణ



చేబ్రోలు: ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పంచాయతీ రాజ్ చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని జెడ్పీ డెప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ సూచించారు. చేబ్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీఓ కె.లలిత అధ్యక్షత వహించారు. కృష్ణ మాట్లాడుతూ గ్రామ పరిపాలన చేసేందుకు ప్రస్తుత శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని చెప్పారు. అక్టోబర్ 14 నుంచి 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం జరుగుతుందన్నారు. సంవత్సరానికి నాలుగు సార్లు గ్రామ సభను నిర్వహించి మూడు నెలల్లో చేసిన అభివృద్ధి పనులు సమీక్షించుకోవాలన్నారు. డీపీఆర్‌సీ గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ పద్మరాణి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలను సమర్థంగా ఉపయోగించుకుంటే పంచాయతీలను అభివృద్ధి చేయగలరన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.లలిత, ఈఓపీఆర్డీ ఉషారాణి పాల్గొన్నారు.

యాదవ హైస్కూల్‌లో వారధి



పట్నంబజారు: ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబంధాలను కలిపి ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రతి ఒక్కరికి తెలియజేయడమే వారధి ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని యాదవ హైస్కూల్‌లో మంగళవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయా ప్రదేశాలకు వెళ్లే సమయంలో ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఏదైనా కేసు నమోదైతే జీవితంలో తీరని మచ్చగా మిగిలిపోతుందన్న అంశాన్ని విద్యార్థులు, యువత గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వైవీ సోమయ్య పాల్గొన్నారు.

విశ్రాంత డీజీపీ మాలకొండయ్యకు మాతృవియోగం

నగరంపాలెం: విశ్రాంత డీజీపీ ఎం.మాలకొండయ్య మాతృమూర్తి, ప్రకాశం జిల్లా వాసి రుక్మిణమ్మ(92) మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు కుమారుడు మాలకొండయ్య, ఓ కుమార్తె సంతానం. గుంటూరులోని కొరిటిపాడు మహాప్రస్థానంలో రుక్మిణమ్మ భౌతికకాయానికి మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ, ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, విశ్రాంత పోలీస్ అధికారులు మేకా రమేష్‌కుమార్, మధుసూదనరావు తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంగళవారం కూటమి నాయకులు తాడేపల్లిలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, రాష్ట్ర నాయకుడు జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి, టీడీపీ నాయకులు ఈరంటి వరప్రసాద్(బస్ బాబు) ఉన్నారు. ధూప దీప నైవేద్య పథకానికి ఇస్తున్న పారితోషికాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలు, కనీస వేతనం రూ.10 వేల నుంచి రూ. 15 వేలకు పెంచడం, వేదం పూర్తి చేసుకున్న ఎటువంటి ఆదాయం లేని వేద పండితులకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేసినందుకు మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ త్వరలో కమిషనర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి అర్చక సమస్యలపై అర్చక జేఏసీ ప్రతినిధులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్చకుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది తెలిపినట్లు నాయకులు తెలిపారు.


మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని అభినందిస్తున్న బీజేపీ నేతలు

పీసీఓడీ సమస్యపై అవగాహన అవసరం

డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: కుటుంబ బాధ్యతలతో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం మంచిది కాదని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబానికి ఏదైనా చేయగలరని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, యువ నారీస్ హెల్త్ కేర్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా పేర్కొన్నారు. బైబిల్ మిషన్ స్త్రీల సభలు మూడు రోజులుగా పెదకాకానిలోని కాకాని స్వస్తిశాలలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హోప్ విన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో 'స్త్రీలలో సంతానలేమి సమస్యలపై' అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ సంతానలేమి సమస్యలతో నేడు ఎక్కువమంది మహిళలు బాధపడుతున్నట్లు తెలిపారు. సమస్యలు వచ్చిన తర్వాత కంటే సమస్యలు రాకముందే అవగాహన పెంచుకుంటే సమస్యలు దరి చేరవని వివరించారు. సమస్యకు అండాశయంలో నీటి బుడగలు కూడా ఒక ప్రధాన కారణమన్నారు. మహిళ తన కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉంటూ తన ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గర్భందాల్చిన సమయంలో పోషకాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మ నివ్వడం సాధ్యపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బిషప్ శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ జాన్, రీనా శామ్యూల్, వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రమీల సెల్వ రాజ్, పాస్టర్లు, బోర్డు మెంబర్స్, సంఘ సభ్యులు, వేల మంది మహిళలు, హోప్ విన్ హాస్పిటల్స్ డాక్టర్స్, మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ షమ సుల్తానా

పట్టణ ప్రణాళిక విభాగంలో బదిలీలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలోని పట్టణ ప్రణాళిక అధికారులకు వార్డుల వారీగా విధులు కేటాయిస్తూ సోమవారం రాత్రి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నగరంలోని 4 జోన్లకు ఎలక్షన్ వార్డుల వారీగా అధికారులకు విధులు కేటాయించారు. మొదటి జోన్ లోని 1, 2, 4, 47, 48, 50 నుంచి 57వ వార్డుల వరకు డెప్యూటీ సిటీ ప్లానర్‌గా జె.సూరజ్ కుమార్, ఎస్.ఫజులార్ రెహ్మాన్ ఏసీపీ(ఇన్‌చార్జి), సీహెచ్ సువర్ణకుమార్(టీపీఎస్), మరో ముగ్గురికి టీపీబీఓ(ఇన్‌చార్జి)లకు విధులు కేటాయించారు. రెండో జోన్‌లోని 3, 5 వార్డుల నుంచి 17వ వార్డుల వరకు డెప్యూటీ సిటీ ప్లానర్‌గా జె.సూరజ్ కుమార్, డి.మల్లికార్జున ఏసీపీ(ఇన్‌చార్జి), ఎస్.కె.రసూల్ టీపీఎస్, మరో ముగ్గురికి టీపీబీఓ(ఇన్‌చార్జి)లకు విధులు కేటాయించారు. మూడో జోన్‌లోని 18 వార్డు నుంచి 31వ వార్డుల వరకు డెప్యూటీ సిటీ ప్లానర్‌గా జె.సూరజ్ కుమార్, సిహెచ్.వెంకటేశ్వర్లు(ఏసీపీ), ఏ లక్ష్మణ స్వామి(టీపీఎస్), మరో ముగ్గురికి టీపీబీఓ(ఇన్‌చార్జి)లకు విధులు కేటాయించారు. నాలుగో జోన్‌లోని 32 వార్డు నుంచి 49వ వార్డుల వరకు ఎస్.ఫజులార్ రెహ్మాన్ (ఏసీపీ, ఇన్‌చార్జి), కె.వి.సత్యనారాయణ(టీపీఎస్), మరో ముగ్గురికి టీపీబీఓ(ఇన్‌చార్జి)లకు విధులు కేటాయించారు. అదే విధంగా రీ సర్వేకి డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లులకు, డిస్ప్లే డివైజ్ పర్మిషన్ ఫీజుల పర్యవేక్షణకు ఎస్.ఫజులార్ రెహ్మాన్(ఏసీపీ, ఇన్‌చార్జి)కి బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నగర పాలక సంస్థకు నూతనంగా కేటాయించబడ్డ సర్వేయర్లు షేక్ మహబూబ్ సుభాని(గుంటూరు తూర్పు నియోజకవర్గం, ఏటుకూరు, బుడంపాడు, పొత్తూరు, చౌడవరం, గోరంట్ల, అమరావతి రోడ్ తూర్పు వైపు, రెడ్డిపాలెం), బి.లక్ష్మీనారాయణ(గుంటూరు పశ్చిమ నియోజకవర్గం, అంకిరెడ్డిపాలెం, నల్లపాడు, పెద్దపలకలూరు, అడవితక్కెళ్ళపాడు, గోరంట్ల, అమరావతి రోడ్ పశ్చిమ వైపు) ప్రాంతాలు కేటాయించారు.

సివిల్ సప్లయీస్ కార్మికులకు దసరా బోనస్ ఇవ్వాలి

లక్ష్మీపురం: సివిల్ సప్లయీస్ కార్మికులకు దసరా బోనస్, యూనిఫాం సౌకర్యాలను అందించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి రావుల అంజిబాబు కోరారు. కార్పొరేషన్ గుంటూరు జిల్లా మేనేజర్(డీఎం) జి.లక్ష్మిని కలసి వినతిపత్రం అందజేశారు. అంజిబాబు మాట్లాడుతూ అగ్రిమెంట్ పూర్తయి పది నెలలు పూర్తయినా నూతన జీవోని ప్రభుత్వం విడుదల చేయకపోవడంపై విచారకరమన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగస్వామిగా ఉన్న ముఠా కార్మికులకు ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా సివిల్ సప్లయీస్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం దసరా బోనస్ తదితర సౌకర్యాలను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాల ద్వారా సాధించుకోవడం జరిగిందన్నారు. వాటిని త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు.


బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరణ


కొత్తపేట భావనారుషి దేవస్థానంలో మహాలక్ష్మీదేవిగా..


కొత్తపేట కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీకామాక్షి దేవిగా..


సంగడిగుంట రెడ్లబజార్ శ్రీకనకదుర్గ ఆలయంలో శ్రీకాళికాదేవిగా..


లాలాపేట శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీసంతానలక్ష్మీగా..


కొత్తపేట శ్రీజగన్నాథస్వామి ఆలయంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..


శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారం

300 మొబైల్ ఫోన్లు అప్పగింత

- విలువ సుమారు రూ.45.50 లక్షలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్


మొబైల్ అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: మొబైల్‌ఫోన్లు పోయాక వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసినట్లైతే, మొబైల్ ఫోన్లను గుర్తించే విధుల్లో టీఏడబ్ల్యూ పోలీస్ సిబ్బంది ఉంటారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. సుమారు రూ.45.50 లక్షల ఖరీదు చేసే 300 రకాల బ్రాండెడ్ మొబైల్‌ఫోన్లను బాధితులకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్లు పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని అన్నారు. తద్వారా సెల్‌ఫోన్లల్లో సమాచారం దుర్వినియోగం కాదని చెప్పారు. పోగొట్టుకున్న ఫోన్లను త్వరితగతిన రికవరీ చేయవచ్చునని తెలిపారు. తమిళనాడు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధికంగా మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్‌చార్జి సీఐ నాగమల్లేశ్వరరావు, ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి, కిషోర్, శ్రీధర్, అరుణ, కరిముల్లా, రమేష్, ఐటీ కోర్ పాల్గొన్నారు.

ఇస్రో పురోగతి గర్వకారణం



లక్ష్మీపురం: ఇస్రో సంస్థ పురోగతి దిశలో ఉందని అని ఇంజినీర్ ఎన్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతరిక్ష గ్రహ రహస్యాల గుట్టు విప్పేందుకు ఆధునిక అంతరిక్ష ప్రయోగాలు ముమ్మరంగా జరుగుతూనే ఉన్నాయన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు.

మునిపల్లె రమణికి ఘన సత్కారం



నగరంపాలెం: ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణి ఏకగళంలో 58 సినిమా పాటలు పాడి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంపాదించినందుకు ఆమెకు అభినందన సభ మంగళవారం నిర్వహించారు. స్థానిక అమరావతి రోడ్‌లోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో అభినందన సభ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని చిరంజీవి నటించిన చలనచిత్ర గీతాలు గాయకులు మునిపల్లె రమణి, వై.హేమమాలిని, పి.లలిత్ బాబు, ఐ.సుబ్రహ్మణ్యం, రాజు, పి.సాయి విశ్వనాథ్, ఎస్.శ్రీనివాసరావు, జె.హనుమంత శాస్త్రి ఆలపించి శ్రోతలను అలరించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి పాల్గొన్నారు. ఆత్మీయ అతిథిగా అఖిలభారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, డైరెక్టర్ జన చైతన్య గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మాదాల రత్నగిరి బాబు, కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ కన్నా మాస్టారు, వాస్తు సిద్ధాంతి టి.శ్రీనివాస్‌రెడ్డి, టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పప్పుల దేవదాస్ జ్యోతి ప్రకాశం చేశారు. మునిపల్లె రమణి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్‌ను అతిథులు అందజేసి సత్కరించారు. వై.హేమమాలి, సింగర్స్ పత్రి లలిత్‌బాబుని, వాద్య సహకారం అందించిన కీబోర్డు జెర్మియా, రవి, తబల పి.వి.రమణ, విజయ్ పాల్ ప్యాడ్స్ లక్ష్మణ్ లను సత్కరించారు.